కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 28, క్యారెట్ 21, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 45, కీర 21, దోసకాయ 21, బీట్‌రూట్ 20, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 50, మొరంగడ్డ 18, కందగడ్డ 58, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నియామకం



నియామక పత్రాన్ని అందుకున్న స్పందన

బన్సీలాల్‌పేట్: బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శిగా బన్సీలాల్‌పేట్ ప్రాంతానికి చెందిన గంధమాల స్పందనను నియమిస్తూ ఆ పార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు కొండేటీ శ్రీధర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా స్పందన మాట్లాడుతూ.. దళితవర్గాల హక్కులతో పాటు అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతానన్నారు. తనకు ఈ బాధ్యతలు రావడానికి సహకరించిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఏ సెక్షన్‌లో ధ్వంసమైన ట్యాంక్







అడ్డగుట్ట బస్టాండ్ సమీపంలో, తుకారాగేట్ సాయిబాబా దేవాలయం దిష్టి బొమ్మల్లా ట్యాంకులు

ఎండాకాలం.. తీరేనా దాహం!

- నిర్వహణ లేక నిరుపయోగంగా నీటి ట్యాంకులు
- ఏళ్లు గడుస్తున్న దక్కని మోక్షం
- మరమ్మతులు చేయాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు

అడ్డగుట్ట: అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపంతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పవర్ బోర్ వాటర్ ట్యాంకుల పరిస్థితి అధ్వానంగా మారింది. అడ్డగుట్టలో ప్రతీ బస్తీలో ఒక ట్యాంక్ ఉంది కానీ.., అందులో నుంచి చుక్క నీరు కూడా రావడం లేదు. గతంలో హుటాహుటిన పదుల సంఖ్యలో పవర్‌బోర్లు వేసి వాటి నిర్వహణను విస్మరించడంతో తిష్టిబొమ్మల్లా మారుతున్నాయి. అడ్డగుట్ట డివిజన్‌లోని అనేక బస్తీలలో వాటర్‌ట్యాంక్‌ల పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఇప్పుడిప్పుడే ఎండాకాలం ప్రారంభమైంది వాటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నిర్వహణ లేక..

గతంలో ప్రస్తుత సికింద్రాబాద్ ఎమ్మెల్యే అడ్డగుట్ట డివిజన్‌లో అడిగిన చోటల్లా ప్రజల సౌకర్యార్థం పవర్‌బోర్లు వేయించి బస్తీకొక వాటర్‌ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. డివిజన్‌లో నీటి ఎద్దడి అధికంగా ఉందని తెలుసుకున్న ఆయన తన నిధులతో దాదాపు 30 పవర్‌బోర్లు వేయించి ట్యాంక్‌లను ఏర్పాటు చేయించారు. వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో అడ్డగుట్ట బస్టాండ్, శాస్త్రినగర్, తుకారాంగేట్‌లోని సాయినగర్, గడ్డమీది బస్తీ, బోయబస్తీ, సాయిబాబా దేవాలయం ప్రాంతంతో పాటు ఇతర బస్తీలలో పవర్‌బోర్ వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి.

దిష్టి బొమ్మల్లా..

అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే డివిజన్‌లోని పవర్‌బోర్ వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారి శిథిలమతున్నాయి. నీటి ఎద్దడిని నివారించేందుకు అన్ని బస్తీల్లో వాటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేసి సదరు వాటర్ ట్యాంకులపై సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు దృష్టి సారించకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయి. దీంతో అవసరాల నిమిత్తం ఇతర బస్తీలలోకి వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన ట్యాంక్‌లకు మరమ్మతులు చేసి నీరు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి..



ప్రజాధనాన్ని వృథా చేసేలా అవసరానికి మించి బోర్లు వేసి వాటిపై సరైన దృష్టి సారించకపోవడంతో ట్యాంకులు పనికిరాకుండా పోయాయి. ప్రజల అవసరాల దృష్ట్యా బోర్లు వేసి వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసిన అధికారులు వాటి నిర్వహణను పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. ప్రజల సౌకర్యార్థం పవర్‌బోర్ వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేశారనుకుంటే అందులో నుంచి చుక్క నీరు కూడా రావడం లేదు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావాలి.

–కాంపల్లి శ్రీనివాస్, సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి

'ఆకర్షణ' 10వ లైబ్రరీ ఏర్పాటు

ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సర్వీస్ హోమ్‌లో నేడు ప్రారంభం

సనత్‌నగర్: చిన్న వయస్సులోనే పుస్తకం గొప్పతనాన్ని తెలియజేస్తూ ఎందరికో చదువుకునే భాగ్యాన్ని కలిగిస్తోన్న చిన్నారి ఆకర్షణ మరో లైబ్రరీ ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు తొమ్మిది లైబ్రరీలను ఏర్పాటు చేసిన ఆకర్షణ అమీర్‌పేట మధురానగర్‌లోని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన సర్వీస్ హోమ్‌లో పదో లైబ్రరీని శుక్రవారం ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉమెన్, చైల్డ్, డిజేబుల్డ్, సీనియర్ సిటిజన్స్ విభాగం కమిషనర్ వాకాటి కరుణ, ఉమెన్, చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ డైరెక్టర్ నిర్మల కాంతి వెస్లీ, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ అక్కేశ్వర్‌రావు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ అనురాధ హాజరై ఈ లైబ్రరీని ప్రారంభించనున్నారు. ఆకర్షణ ఇప్పటివరకు 6,498 పుస్తకాలను సేకరించారు. ప్రస్తుతం చిన్నారి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతుంది.

రహదారులపై చెత్త వేస్తే జరిమానాలు



రామాలయం వీధిని సందర్శించిన సామల హేమ

సికింద్రాబాద్: రహదారులపై చెత్త వేసే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని చలాన్లు విధిస్తామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ చెప్పారు. సీతాఫల్‌మండి డివిజన్ రామాలయం వీధిలోని డెడ్‌లాక్ బిల్డింగ్ వద్ద పలువురు వ్యక్తులు వ్యర్థాలు వేస్తున్నారనే ఫిర్యాదు మేరకు గురువారం ఆమె జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి రామాలయం వీధిని సందర్శించి మాట్లాడారు. చెత్త సేకరణ కోసం వచ్చే జీహెచ్ఎంసీ సిబ్బందికి చెత్తను అందించాలన్నారు. ఇప్పటికే పలుమార్లు రహదారులపై చెత్త వేయవద్దని స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇకముందు రహదారులపై చెత్త వేసే వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి చలాన్లు విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, బీఆర్ఎస్ నాయకుడు రాజసుందర్ పాల్గొన్నారు.

రాముడి పేరును రాజకీయాలకు వాడొద్దు



జోడోయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సికింద్రాబాద్: రాముడి పేరును రాజకీయ లబ్ధి కోసం వాడుకుని బీజేపీ మరోమారు సనాతన ధర్మాన్ని అపహాస్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ నాయకుడు వేణుగోపాలస్వామి విమర్శించారు. గురువారం మెట్టుగూడ వరకు భారత్‌జోడో యాత్రను నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాముడు, హిందుత్వాన్ని పక్కాగా రాజకీయాలకు వాడుకుని బీజేపీ మరోమారు ఢిల్లీ పీఠాన్ని సొంతం చేసుకునేందుకు ఎత్తుగడలు వేస్తుందన్నారు. మతతత్వ విధానాలను రెచ్చగొట్టి లబ్ధిపొందే అవకాశవాద రాజకీయాలకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ద్వారా మాత్రమే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సెక్యులర్ విధానాలతో దేశ అభివృద్ధి కోసం పాటుపడే కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌కు సన్మానం



ప్రొ.శ్రీరాం వెంకటేష్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌ను వివిధ వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. గురువారం ఉన్నత విద్య మండలి కార్యాలయంలో ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పరుశురామ్, అధ్యాపకులు అంబటి శ్రీనివాస్, కాంత రెడ్డి, వెంకటేశ్వర్లు, మోహన్, విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గాలో పద్మారావు ప్రార్థనలు



సికింద్రాబాద్: అజ్మీర్ దర్గాకు వెళ్లిన సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే సంప్రదాయబద్ధంగా చాదర్ సమర్పించారు. ఎమ్మెల్యే వెంట సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం మత పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న సిబ్బంది

అడ్డగుట్ట: రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని మెడికల్ డైరెక్టర్ నిర్మల అన్నారు. అసోసియేషన్ ఆఫ్ రైల్వే నర్సెస్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో లాలాగూడలోని కేంద్రీయ రైల్వే హాస్పిటల్‌లో మూడు రోజులుగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడికల్ డైరెక్టర్ నిర్మల పాల్గొని మాట్లాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి, ప్రమాదాల బారిన పడిన వారికి అత్యవసరంగా రక్తం అవసరమైనప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అందువల్ల రక్తదానం చేయడంతో సాటి మనిషి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు ఉపయోగపడుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే నర్సులు చేస్తున్న రక్తదానం కార్యక్రమాన్ని ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. లాలాగూడలో నర్సింగ్ స్టాఫ్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ నర్సింగ్ సూపరింటెండెంట్ రేణుక ఆర్ల, డాక్టర్ కృష్ణవేణి, లీలా శివమూర్తి, ఆనిసెంట్, బినోజ్, జుమోన్, అజిలాల్, దీపక్, యాసిన్ పాల్గొన్నారు.

పీఎం భార్గవ సేవలు మరువలేనివి



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న పూర్వ విద్యార్థులు

లాలాపేట: సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలోజీ(సీసీఎంబీ) వ్యవస్థాపక డైరెక్టర్ పీఎం భార్గవ జయంతిని పురస్కరించుకుని గురువారం సీసీఎంబీ ఫౌండర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎంబీ పూర్వ విద్యార్థులు, పీహెచ్‌డీ స్కాలర్స్ పాల్గొని సీసీఎంబీలో ప్రత్యేకమైన ఇన్నోవేషన్స్, ఆర్ట్ (రంగవల్లులతో) వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎంబీ ప్రస్తుత డైరెక్టర్ డాక్టర్ వినయ్ కే నందుకూరి మాట్లాడుతూ.. సీసీఎంబీ ఫౌండర్ డైరెక్టర్‌గా పీఎం భార్గవ అందించిన సేవలను మరువలేనివన్నారు. సీఎస్ఐఆర్–నేషనల్ కెమికల్ ల్యాబోరేటరీ డైరెక్టర్ డాక్టర్ ఆశీష్ లేలే భారతదేశంలో గ్రీన్ హైడ్రోజన్ ఇంధనాన్ని ఉపయోగించే అంశాలపై కీలకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో డా. సుభాషిని సదాశివం, డా. రాజేష్ రామ్‌చంద్రం, ప్రొఫెసర్ మోహాలి, శ్రీలక్ష్మీ, గోవర్ధన్ తదితరులున్నారు.

మాతృభాష చరిత్రకు సజీవ సాక్ష్యం

ఓయూ రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి

కాచిగూడ: మాతృభాష అంటే కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే భావవ్యక్తీకరణ మాత్రమే కాదని అది మనవ జాతి జీవనాడి అని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ మాజీ అధిపతి ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మాతృభాష అంటే వేల ఏళ్ల చరిత్ర, సంస్కృతికి సజీవ సాక్ష్యమని అన్నారు. బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. భాషను దూరం చేసుకుంటే మన ఉనికికే ప్రమాదమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 7వేల భాషలున్నాయని, వీటిలో ప్రపంచంలో సగానికి పైగా 23 భాషలు మాట్లాడుతున్నారని తెలిపారు. మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష అమ్మభాష అని పేర్కొన్నారు. మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించడం సులభమని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగం ప్రొఫెసర్ కె.సంగీత మాట్లాడుతూ.. మాతృభాషను విస్మరించడమంటే కన్నతల్లిని మర్చిపోవడం లాంటిదేనని చెప్పారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకట్‌రావు, హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, కార్యదర్శి సాయిరామ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చిలకలగూడ: ఎంసీఆర్ ప్రజాసేవ అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు మ్యాకల చంద్రశేఖరరావు నేతృత్వంలో మెట్టుగూడ డివిజన్ చింతబావిలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్ సుందర్ గౌడ్, మేకల సారంగపాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంసీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు మ్యాకల చంద్రశేఖర్‌రావు అన్నారు.

ఓయూలో పూలే విగ్రహం ఏర్పాటు



విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని పూలే పరిశోధన కేంద్రం ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, పూలే రిసెర్చ్ సెంటర్ డైరెక్టర్, బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ చల్లమల్ల వెంకటేశ్వర్లు, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొ.మంగు తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ వంశరాజ్ తన జన్మదిన వేడుకలను గురువారం శాంతినగర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం పలువురు స్థానిక నాయకులు కుమార్‌ను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

జాతరకు వెళ్తున్నారా.. జాగ్రత్తలు పాటించండిలా!

గాంధీఆస్పత్రి: తెలంగాణ కుంభమేళ, వన దేవతల జాతర మేడారం వెళ్తున్నారా.. తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, మారిన వాతావరణ పరిస్థితులతో వైరల్ ఫీవర్లు (విషజ్వరాలు) విస్తృతంగా విజృంభిస్తున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, ముక్కుకారడం, ఒళ్లునొప్పులు, పొడిదగ్గు తదితర లక్షణాలు ఉంటే రూపాంతరం చెందిన రెస్పరేటరీ వైరస్‌లతో కలిగే విష జ్వరాలుగా గుర్తించాలని కోరుతున్నారు. గతంలో ఐదు నుంచి ఏడు రోజుల పాటు ఉండే ఈ లక్షణాలు ఇప్పుడు మూడు నుంచి నాలుగు వారాల వరకు పట్టి పీడిస్తున్నట్లు తమ పరిశీలనలో తేలిందని, ఇతర లక్షణాలు తగ్గినా పొడి దగ్గు నెలల పాటు కొనసాగుతుందన్నారు. కోట్లాది మంది ఒకే చోట గుమిగూడే మేడారం జాతర పరిసర ప్రాంతాల్లో రెండురకాల ఇన్ఫెక్షన్లు పొంచి ఉంటాయన్నారు. తినే ఆహార పదార్థాలు, తాగే నీటితో ఓ రకమైన, గాలిలో ఉన్న వైరస్‌లతో మరో రకమైన రుగ్మతల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. జాతర వెళ్లే భక్తులు, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆయా రుగ్మతలకు చెక్ పెట్టే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

పాటించాల్సిన అంశాలివే..

- చిన్నపిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు, గుండె, ఆస్తమా, టీబీ తదితర దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు జాతరకు వెళ్లకపోవడం ఉత్తమం. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సివస్తే తగు జాగ్రత్తలు పాటించాలి.
- జాతరలో సామాజిక దూరం పాటించడం సాధ్యం కాదు కనుక వీలయినంత వరకు మాస్క్ ధరించాలి, హ్యాండ్ శానిటైజేషన్ చేసుకోవాలి. ఆరు బయట లభించే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.
- ఆహార పదార్థాలు, తాగునీరు కలుషితం కావడంతో పాటు గాలిలో ఉన్న వైరస్‌లతో కలరా, టైఫాయిడ్, హైపటైటిస్–ఏ, ఈ, డయేరియా, డిసెంట్రీ తదితర రుగ్మతలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాచి వడపోసిన నీటిని ఇంటి నుంచే తీసుకెళ్లడం మంచిది.
- దగ్గు, తుమ్ముల ద్వారా డ్రాప్‌లెట్ ఇన్ఫెక్షన్లు వ్యాపించే అవకాశం ఉంది. తప్పని సరిగా మాస్క్‌లు ధరించాలి. ఎవరికీ షేక్‌హ్యాండ్ ఇవ్వొద్దు. హ్యాండ్‌వాష్ లేదా శానిటైజేషన్ చేసుకోకుండా ముఖంలోని ఏ భాగాన్ని తాకవద్దు.
- జాతర పరిసర ప్రాంతాల్లోని బావులు, చెరువుల్లోని నీటిని, స్థానికంగా లభించే మినరల్ వాటర్ బాటిల్స్ వినియోగించవద్దు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద లభించే మంచినీరు తాగడం మంచిది. పారాసిటమల్ మాత్రలు వెంట తీసుకెళ్లాలి.

రెండు రకాల ఇన్ఫెక్షన్లతో ప్రమాదం



మేడారం జాతరకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఫుడ్ అండ్ వాటర్, ఎయిర్ బార్న్ (గాలిలో వ్యాపించే వైరస్)తో పలు రకాల ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మాస్క్, హ్యాండ్ శానిటైజేషన్ తప్పరిసరి. బయట లభించే ఆహార పదార్థాలు తీసుకోవద్దు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. చేతులతో ముఖ భాగాలను తాకరాదుద్దు. జ్వర లక్షణాలు కనిపిస్తే పారాసిటమల్ మాత్రలు వేసుకుని దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలి.

–ప్రొఫెసర్ రాజారావు, గాంధీ సూపరింటెండెంట్

అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఎమ్మెల్యే తలసానికి వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

సనత్‌నగర్: అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. సనత్‌నగర్ బస్టాండ్ సమీపంలోని గ్రౌండ్ పరిసరాలలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రౌండ్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా వదిలివేయడం వల్ల రాత్రి వేళల్లో మద్యం ప్రియులకు అడ్డాగా మారిందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా వారాంతపు సంతలో భాగంగా గ్రౌండ్‌లో కూడా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే.. గ్రౌండ్‌ను అభివృద్ధి చేయడానికి, సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో దేశానికి స్వాతంత్య్రం వచ్చిన 64 ఏళ్లలో జరగని అభివృద్ధిని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 10 సంవత్సరాల్లో చేసి చూపించామన్నారు.ఎన్నికల ముందు తెలంగాణ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులను మంజూరు చేసిందని, వాటిలో అనేక పనులు టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు చేపట్టడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, ఈఈ ఇందిర, డీఈ మోహన్, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, ఎలక్ట్రికల్ డీఈ అమర్నాథ్, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, రాజేష్, నోమాన్, జమీర్ పాల్గొన్నారు.

మేకలమండి పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తా..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ మేకలమండి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తలసాని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాల సాధన సమితి ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యేను కలిసి పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి రూ. 65 లక్షలు మంజూరు చేయాలని వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారంతో నిమిత్తం లేకుండా పాఠశాల పురోభివృద్ధి ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ ఆదుకుంటానని చెప్పారు. తన ఎమ్మెల్యే కోటా నిధుల నుంచి పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి రూ. 65లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల సాధన సమితి ప్రతినిధులు ఇ. చంద్రశేఖర్, బి. నర్సింగ్‌రావు, వీజే శేషగిరిరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక జిల్లా ఉద్యమానికి మద్దతివ్వాలి..

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో జరుగుతున్న ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కోరారు. ఈ మేరకు సాధన సమితి ప్రతినిధులు గురువారం తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యం కోసం హైదరాబాద్ జిల్లాను రెండుగా విభజించాలన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లోని 40 మున్సిపల్ డివిజన్లకు కలుపుతూ జిల్లాను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు అన్ని విధాల న్యాయం జరుగుతుందన్నారు. వినతి ఇచ్చిన వారిలో బాల్‌రాజ్‌యాదవ్, శైలేందర్, బాబూరావు, సునీల్‌ముదిరాజ్ ఉన్నారు.